క్లుప్తంగా

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పని ప్రదేశాల్లో ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రైల్వే హాస్పటల్ సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే హాస్పటల్ న్యూ ఓపీడీ భవనంలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శౌరిబాల మాట్లాడుతూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల ఒత్తిడి అధిగమించేందుకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పని ప్రదేశాల్లో మానసిక ఆరోగ్య ప్రతికూల వాతావరణం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ మానసిక ఆరోగ్య సమస్యలు, చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

బూస్టర్ పనుల నిలుపుదల



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ 48వ డివిజన్ పరిధిలోగల శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపం ముందు ప్రధాన రహదారికి అడ్డంగా నిర్మిస్తున్న మంచినీటి బూస్టర్ గది నిర్మాణ పనులను అధికార, ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. 'రోడ్డుకు అడ్డంగా బూస్టర్ నిర్మాణం' శీర్షికతో గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికార, ప్రతిపక్ష నాయకులు స్పందించారు. వైఎస్సార్ సీపీ నుంచి అత్తలూరి పెదబాబు, టీడీపీ నుంచి ఎమ్ఎస్ బేగ్, బీజేపీ నుంచి అడ్డూరి శ్రీరామ్ ఇతర పార్టీల నాయకులు గురువారం నిర్మాణంలో ఉన్న బూస్టర్ గది వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నిత్యం రద్దీగా ఉండే సొరంగ మార్గానికి వెళ్లే మెయిన్ రోడ్‌లో పంపింగ్ బూస్టర్ గదిని నిర్మించటం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా ప్రమాదాలుకూడా చోటు చేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారికి అడ్డంగా బూస్టర్ గది నిర్మాణాన్ని చేపట్టటం మంచి పద్ధతి కాదని, నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు.

నృత్యం సమర్పయామి..



విజయవాడ కల్చరల్: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళావేదికపై గురువారం కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. వెంకట రమణ బృందం దేవీ కీర్తనలతో కార్యక్రమాలు ప్రారంభించింది. శ్రీదేవి, రవికుమార్ బృందం త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపించారు. కె.సత్యవతి బృందం అష్టలక్ష్మీ వైభవం సాహితీ రూపకాన్ని ప్రదర్శించారు. నాట్యాచారిణి మునిపల్లె మహతి బృందంలోని చిన్నారులు అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలు అభినయించారు. శివకుమారి, ఎంఎస్ మనోజ్ఞ, ఎ. ఉషామాధవి, శ్రావ్య, అరుణ్ కల్యాణ్, రాయన శ్రీనివాసరావు, పి. పూజ్యశ్రీ, నందికొట్కూర్‌కు చెందిన సాయి లిఖితశ్రీ, డి. జగదీష్, వేదాంతంమౌళి, డి.చంద్రశేఖర్, చైత్రసుశి, గణేష్ కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్రనాట్యం సంప్రదాయంలో చక్కనితల్లికి ఛాంగ్‌భళా, పలుకు తేనియ తల్లి, ఇదిగో భద్రాద్రి, కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు అంశాలను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు సైదా, కేవీ రామకృష్ణ, గంగాధర్ నిర్వహించారు. కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

విద్యుత్ అనధికారికంగా వాడితే కఠిన చర్యలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): అనధికారికంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆటోనగర్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారికంగా విద్యుత్ లోడు వాడకం.. వాణిజ్య సముదాయాలతో పాటు పరిశ్రమల్లో వాడేవారి నుంచి రూ.రూ.4.50 లక్షలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 39 బృందాలుగా ఏర్పడి 2343 గృహవినియోగ సర్వీస్‌లు, మరో 274 వాణిజ్య సర్వీస్‌లతో పాటు ఇంకొక 31 పరిశ్రమ సర్వీస్‌లను తనిఖీ చేశామని వెల్లడించారు. ఇందులో భాగంగా 95 సర్వీస్‌లకు అదనపు లోడు 193 కేవీకి గాను మొత్తం రూ.4.50 లక్షల జరిమానా విధించామని వివరించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



కుంకుమపూజలో దంపతులు







నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దుర్గాదేవీ నమోస్తుతే...

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు కోలాహలంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అమ్మవారి ఊరేగింపు



కేరళ వాయిద్యాల మధ్య ఊరేగింపు సాగుతున్న దృశ్యం

కూటమి నేతలకే ప్రొటోకాల్

- బంధుగణ సేవలో సేవా కమిటీ
- ఘాట్‌రోడ్డుపై యథేచ్ఛగా తెలుగు తమ్ముళ్ల వాహనాలు
- సాధారణ భక్తులకు తప్పని ఇక్కట్లు
- పేరుకే నిబంధనలు.. ఆదేశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో యావత్ అధికార యంత్రాంగం అడ్డగోలుగా కూటమి నాయకుల సేవల్లోనే నిమగ్నమై తరిస్తున్నారు. భక్తుల కోసం అధికార యంత్రాంగం ఎన్ని నిర్ణయాలు చేసినా అవన్నీ తూచ్ అంటూ అధికారులు అధికార పార్టీ నేతలకు సాగిలపడుతూ ఆలయ ప్రాంగణంలో సేవలందిస్తున్నారు. గడిచిన నెల రోజులుగా దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి నుంచి వివిధ శాఖల అధికారులు జిల్లా ఉన్నతాధికారులు పదేపదే సమావేశమై అనేక నిర్ణయాలు చేశారు. కానీ అవన్ని కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. దర్శనానికి వచ్చిన వారికి ఎటువంటి అధికార హోదా లేకపోయినా కూటమి పార్టీ నేతలైతే వారికి ప్రొటోకాల్ స్థాయిలో అమ్మవారి దర్శనం అందుతుంది. తెలుగుదేశం, జనసేన,



జనసేన నేత బాడిత శంకర్‌కు రాచమర్యాదలు చేస్తున్న అధికారులు (కుడి వైపు)

బీజేపీకి చెందిన నాయకుల వారికి పార్టీలో పదవి లేకపోయినా సరే అమ్మవారి సన్నిధిలో మాత్రం వారికి అనుకూలమైన నాయకుల పేరు చెప్పి అన్ని మర్యాదలు పొందవచ్చని వారిని చూసిన పలువురు అధికారులు విమర్శలు చేస్తున్నారు. నగరంలోని పలువురు టీడీపీ నేతలు తమ వాహనాలతో నేరుగా కొండపైకి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకొని వెళ్తున్నారు. అలాగే జనసేన నేతలకు సైతం వారికి అమ్మవారి సన్నిధిలో అంతరాలయ దర్శనంతో పాటుగా రాచమర్యాదలు అందుతున్నాయి. బీజేపీ నేతలకు ఇక సరేసరి.

బంధుగణ సేవలో సేవా కమిటీ...

కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా సేవా కమిటీ అంటూ దసరా ఉత్సవాలకు ఒక కమిటీని నియమించింది. అది కూడా 56 మంది జంబో సైజ్ కమిటీని నియమించిందని దీనివలన ఉపయోగమేమిటంటూ విమర్శలు వినిపించాయి. విమర్శలకు తగ్గట్టుగానే ఆ కమిటీ పార్టీ నాయకులు, బంధువుల సేవల్లో ఉదయం నుంచి రాత్రి వరకూ నిమగ్నమవుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. వారికి అనధికారికంగా 20 మందికి దర్శనం చేయించుకోవాలని దేవస్థాన ఉన్నతాధికారి చెప్పినట్లు ఆలయ వర్గాలు చెబుతున్నాయి.

ఘాట్‌రోడ్డుపై తమ్ముళ్ల వాహనాలు..

నగర ప్రథమ పౌరురాలు, నగర మేయర్ ఆలయానికి వస్తే ఆమెకు ప్రొటోకాల్ లేదంటూ ఆమె వాహనాన్ని అడుగడుగున అధికారులు అడ్డుకొని అవమానించిన విషయం తెలిసిందే. అయితే తెలుగుదేశం పార్టీ నేతలకు మాత్రం ఏ పదవి లేకున్నా వారిని ఏ అధికారి అడ్డుకోవటం లేదంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీకి ఇన్ని పాసులంటూ ఏ హోదా లేకున్నా కారుపాస్‌లను ఆలయం నుంచి జారీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన నాయకులు మూలానక్షత్రం రోజున తమ వాహనాలతో ఘాట్‌రోడ్డులో హల్‌చల్ చేశారు.

రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని విజయ డెయిరీ (కృష్ణామిల్క్ యూనియన్) చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. రతన్ టాటా మృతికి సంతాపంగా విజయ డెయిరీ పరిపాలనా భవనంలో ఆయన చిత్రపటానికి చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు పూలమాల వేసి నివాళులర్పించారు. మానవత్వం, విలువలతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అని కొనియాడారు. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరిమానిధిగా తన జీవితాంతం కృషి చేసిన గొప్ప వ్యక్త రతన్ టాటా అని పేర్కొన్నారు. నిత్య జీవితంలో ఉపయోగపడే ప్రతి వస్తువును తయారు చేసిన గొప్ప వ్యక్తి అన్నారు.



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ ఆంజనేయులు

టాటా గ్రూపు ఉత్పాదనలు అంటే నాణ్యతకు, నమ్మకానికి మారు పేరుగా నిలిచాయన్నారు. దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా, వారిని ఆదుకోవడంలో రతన్ టాటా ఎప్పుడు ముందంజలో ఉండే వారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామన్నారు. డెయిరీ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రతన్ టాటాకు కేశినేని నివాళి



విజయవాడస్పోర్ట్స్: టాటా గ్రూప్స్ చైర్మన్ రతన్ టాటా పార్థివ దేహానికి విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) నివాళులర్పించారు. ముంబైలోని నేషనల్ సెంటర్ ఫర్ ఫెర్మారింగ్ ఆర్ట్స్ గ్రౌండ్స్‌లో ఉంచిన రతన్ టాటా పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు, టాటా గ్రూప్స్ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేశినేని నానితో పాటు ఆయన కుమార్తె కేశినేని శ్వేత ఉన్నారు.

డ్రోన్లతో ట్రాఫిక్ నియంత్రణ...





ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ ఆధ్వర్యంలో పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ నియంత్రణపై డ్రోన్స్ ద్వారా సమాచారం అందజేస్తున్నారు, ఎక్కడ ట్రాఫిక్ ఉంటే ఆ ప్రాంతాల్లో డ్రోన్స్ ద్వారా మైక్ లో అనౌన్స్ చేయడంతో ట్రాఫిక్ తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఈ డ్రోన్ పలు రకాలుగా వినియోగించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ట్రయల్ రన్ చేస్తున్న దశ్యాలు బస్టాండ్ సమీపంలో కన్పించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



దుర్గాదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



విజయదుర్గా అమ్మవారికి విశేష అలంకరణ



గంగానమ్మకు దుర్గాదేవి అలంకరణ

దుర్గాదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు

చిట్టినగర్/వన్‌టౌన్: వన్‌టౌన్, చిట్టినగర్‌లోని వివిధ ప్రాంతాల్లో కొలువై ఉన్న అమ్మవారు గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిగా దర్శనమిచ్చిన ఆయా దేవతామూర్తులను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని పూజలు నిర్వహించారు.



దుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



దాసాంజనేయస్వామి వారి సన్నిధిలో దుర్గాదేవిగా అమ్మవారు



విష్ణుపాదోద్భవిదేవిగా పద్మావతి అమ్మవారు

ఏపీ టెట్ పరీక్షకు 1605 మంది హాజరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ టీఈటీ –2024 ఆన్‌లైన్ పరీక్షలు గురువారం ఎనిమిదో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లాతో పాటుగా ఖమ్మం జిల్లాలోని తొమ్మిది పరీక్షా కేంద్రాలను కేటాయించారు. అందులో ఆరు కేంద్రాల్లో గురువారం పరీక్షను నిర్వహించారు. ఎనిమిదో రోజు జరిగిన పరీక్షలో రెండు షిఫ్టులు కలిపి 1903 మంది అభ్యర్థులను కేటాయించగా అందులో 1605 మంది హాజరయ్యారు. 293 మంది గైర్హాజరయ్యారు. శ్రీవాహిణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, (తిరువూరు), పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (విజయవాడ), ఐయాన్ డిజిటల్ జోన్ (కంట్రిక, విజయవాడ), ఎస్వీ ఇన్ఫోటెక్ (రామమందిరం రోడ్డు విజయవాడ), లైఫ్‌బ్రిడ్జి ఇన్ఫో టెక్నాలజీస్ (గొల్లపూడి విజయవాడ), శ్రీ విజయదుర్గా ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు విజయవాడ రూరల్) తదితర పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగాయి. ఉదయం షిఫ్టుకు సంబంధించి 1191 మంది అభ్యర్థులను కేటాయించగా 1016 మంది హాజరయ్యారు. 175 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టుకు సంబంధించి 712 మంది అభ్యర్థులను కేటాయించగా 589 మంది హాజరయ్యారు. 123 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాల్లో భాగంగా వందలాది మంది మహిళలు సామూహిక కుంకుమార్చనలలో పాల్గొంటున్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవంలో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కేబీఎన్ కళాశాల ఆవరణలోని దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా చండీ సప్తసతి హోమంతో పాటుగా అమ్మవారి అలంకారానికి సంబంధించిన మూల మంత్ర సంపుటితో చండీ హోమం నిర్వహిస్తున్నారు. లలితా సహస్ర నామాలతో కుంకుమార్చనలు చేస్తున్నారు. నిత్యం రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మీ,



సామూహిక కుంకుమార్చనలు

మృత్యుంజయ హోమాలు జరిగాయి. అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు పాల్గొన్నారు.

అలరించిన నృత్యం



దసరా ఉత్సవాల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు నృత్యాలు వీక్షించి ఆనందిస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తమ్మిన పోతరాజు సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ శాసనసభ్యుడు తమ్మిన పోతరాజు అందించిన సేవలు అపూర్వమని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. కొత్తపేట లెనిన్‌భవన్‌లో తమ్మిన పోతరాజు జయంతి ఆ పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పోతరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తమ్మిన తన వంతు కృషి చేశారన్నారు. ఎందరో యువకులు, కార్మికులను కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులు చేశారని చెప్పారు. పార్టీ బలోపేతానికి బాటలు వేశారని, రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎంపికై విజయవాడ నగరాభివృద్ధి కోసం, పాత బస్తీ కొండ ప్రాంతాల మౌలిక సదుపాయాల కల్పన కోసం పాటుపడ్డారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 52 మంది కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యుల్లో



పోతరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తమ్మిన పోతరాజుతో సహా తమ శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి, విశాఖ ఉక్కు పరిశ్రమను సాధించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం, ప్రైవేటీకరించటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివ రావు, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు కార్యవర్గ సభ్యులు డీవీ రమణబాబు, ఓర్సు భారతి తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండండి

కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలు ముగింపునకు చేరుకుంటున్నందున భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం ఆయా శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ భక్తుల తాకిడి నేపథ్యంలో గుడి పరిసరాలు, స్నానఘాట్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లో భక్తులు వదిలేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పారు. క్యూలైన్లో తాగునీటి ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి పాయింట్లలో స్టాక్ ఉండేలా ప్రణాళిక చేసుకోవాలని, స్టాక్ పాయింట్లలో ఉన్న స్టాక్‌లను గంట గంటకు తనకు నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

దహన సంస్కారాలు నిలిపివేత

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుపుతున్న కృష్ణలంక భ్రమరాంబపురంలోని స్వర్గపురిలోని ఎలక్ట్రికల్ క్రిమిటోరియం (విద్యుత్ దహన వాటిక)కు మరమ్మతులు చేస్తున్నందున ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఇందులో దహన సంస్కారాలు నిలిపేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి నగరవాసులు వీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.